క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు: పామూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్.జిలానీ తెలిపారు. పామూరు, తూర్పు కోడిగుడ్లపాడు, నుచ్చుపొద, దూబ గుంట్ల, బుక్కాపురం, పడమటి కట్టకిందపల్లె పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలకు సహకరించాలని కోరారు.

2న మండల సర్వసభ్య సమావేశం

కొండపి(సింగరాయకొండ): కొండపి మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 2వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులు అజెండా అంశాలపై నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అజెండా ప్రతులను సమావేశానికి రెండు రోజుల ముందు కార్యాలయంలో ఇవ్వాలని స్పష్టం చేశారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

పొగాకు గరిష్ట ధర రూ.359

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన పొగాకు వేలంలో అత్యధిక ధర కేజీ రూ.359 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, గ్రామ పరిధిలోని రైతులు 1099 బేళ్ల వేలానికి తీసుకొచ్చారు.అందులో 982 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 117 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.278.18 పలికింది. వేలంలో 22 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కలిగి ఉండాలి



టంగుటూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

టంగుటూరు: డయేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రసాద్‌బాబు సూచించారు. స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే బాలిక గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు డయేరియా, సీజనల్ వ్యాధులు, కుష్టు వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. కాచి చల్లార్చి నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు



నూతన ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న చైర్మన్ గఫార్, ఏఈ

కనిగిరి రూరల్: పట్టణంలో విద్యుత్ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో చైర్మన పర్యటించారు. లో ఓల్టేజీ సమస్య ఉన్న ఏరియాల్లో, విద్యుత్ పోల్స్, కొత్త ట్రాన్స్‌ఫారం, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త పోల్స్ వేసేందుకు అధికారులకు తగు సూచనలు చేశారు. త్వరలో నూతన పోల్స్, ట్రాన్స్‌ఫారంలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్‌ను అందచేయాలని ఏఈకి తెలిపారు. ఏఈ పవన్‌కుమార్, టీపీఓ వివేకానంద కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీఎస్‌పురం(పామూరు): పర్యావరణ పరిరక్షణకు పాఠశాలల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పాఠశాలలను ఉద్యానవన కేంద్రాలుగా రూపుదిద్దవచ్చని పాఠశాల హెచ్‌ఎం షేక్ చాంద్‌బాషా అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం క్రమేణా పూర్తిస్థాయిలో నిరోధించాలని, ఇందులో ప్రజలు పూర్తి చైతన్యవంతులై సహకరించాలన్నారు. ఉపాధ్యాయుడు యం.షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

4 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం బాజీబాబు తెలిపారు. మండలంలోని అన్నిబోయినపల్లె గ్రామ శివారులో ఉన్న మన్నేరు వాగు నుంచి సోమవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి ఇసుక లోడుతో వెళుతున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సూపర్ సిక్స్‌కు సున్నం పెట్టిన బాబు

- రాష్ట్రంలో విధ్వంసక పాలన, ప్రజలను మోసం చేయడమేనా చంద్రబాబు అభివృద్ధి
- అరాచక పాలనకు బ్రాండ్ ఇమేజ్‌గా ఏపీని మార్చారు
- వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌కు సున్నం పెట్టి రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారాల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఊదర గొట్టి ప్రజల ఓట్లను పొందిన చంద్రబాబు.. ఇప్పుడేమో వాటి ఊసే ఎత్తకుండా నిస్సిగ్గుగా జారుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తుంటే.. చంద్రబాబు రాక్షస, ఆటవిక పాలన సాగుతున్నట్లు ఉందని ఆరోపించారు. టీడీపీ నేతల దాడులను, వికృత చేష్టలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు రాజకీయాలు అయినా, పాలన అయినా అంతా వెనుక ఉండి నడిపిస్తుంటారని విమర్శించారు. ప్రతీకార దాడులు మానుకొని ప్రజలకు సంక్షేమం అందించాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులం, మతం, వర్గం పార్టీలు చూడకుండా అర్హత ప్రమాణికంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ధ్వంసమైందని అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. 2019 మే 30న వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్ర ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే ఉందన్నారు. అంతటి కష్టంలో కూడా 2019 జులై 5 న పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడితే కేవలం వారం రోజుల్లోనే రాష్ట్రంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. వరుసగా ఐదేళ్లలో పేదల ఖాతాలోకి రూ.2 లక్షల 71 వేల కోట్లు నేరుగా సంక్షేమ పథకాల నిధులు జమ చేశామన్నారు. కానీ నేడు చంద్రబాబు ప్రభుత్వం మాత్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా మరో మూడు నెలలు ఓటాన్ అకౌంట్ కు వెళ్లిందన్నారు. రాష్ట్రం మొత్తం బడ్జెట్ ఎంత, రాష్ట్ర ఆదాయం, ఖర్చు ఎంత రాష్ట్రంలో ఉన్న రుణాల మొత్తం ఎంత తదితర వివరాలను కూటమి ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు ఎంత నిధులు ఖర్చవుతుందనే దానిపై రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి పథకం, రైతు భరోసా నగదు తల్లుల, రైతుల ఖాతాల్లో జమ చేసి ఉండే వారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఖరీఫ్ వచ్చినా.. నేటికీ దాని ఊసే ఎత్తలేదన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి దాన్ని విస్మరించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తూ వారికి గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని చెప్పి నేడు దాన్ని పక్కకు నెట్టిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కోత పెడుతోందని ఆరోపించారు. మత్స్యకార భరోసా, పోలవరం ఇలా అన్నింటిని చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

మద్యం పై చంద్రబాబు చెప్పిన శ్వేత పత్రం పచ్చి అబద్ధం అన్నారు. కేవలం 50 రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం, ఆటవిక పాలన అనే బ్రాండ్ ఇమేజ్‌ను చంద్రబాబు సృష్టించారని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో విధ్వంసక పాలన చేయడం.. ఇచ్చిన హామీలను తొంగలు తొక్కడం ఇదేనా అభివృద్ధి అంటే చంద్రబాబు అని దద్దాల ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



కందుకూరు: ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కందుకూరు: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 7 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పలు వ్యక్తిగత సమస్యలతో పాటు, రోడ్లు, డ్రైనేజీలు వంటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆయా విభాగాల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్యం, ఇతర సమస్యలపై 9177700267 నంబర్‌కు ఫోన్ చేసి తెలపవచ్చని సూచించారు.

హనుమంతునిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదికకు నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కె.కిషోర్‌రెడ్డి తెలిపారు. వచ్చిన నాలుగు అర్జీలు భూమి ఆన్‌లైను చేయాలని వచ్చాయన్నారు. వేములపాడు నుంచి 2, హాజీపురం, నందనవనం, ఆనందపురం నుంచి ఒక్కో అర్జీ వచ్చిందన్నారు. వారం రోజుల్లో అర్జీలను పరిష్కరిస్తామన్నారు.

వలేటివారిపాలెం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఒక అర్జీ వ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. కొండసముద్రం గ్రామానికి చెందిన ఎం హిమ బిందు తన పొలానికి ఆన్‌లైన్ కావాలని ఒక అర్జీ పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



ధృవీకరణ పత్రాలు అందచేస్తున్న రామన విజయలక్ష్మి, రవితేజ

కనిగిరి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీపీడీసీ), నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎల్ఎన్ఎం మహిళా డిగ్రీ కళాశాలలో నైపుణ్యతపై శిక్షణా తరగతులు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేరకు 43 మందికి ధ్రువీకరణ పత్రాలను జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి జె.రవితేజ, కళాశాల కరస్పాండెంట్, డైరక్టర్ రామన్న విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జె.రవితేజ మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీఎసీ ద్వారా ప్రస్తుత కంపెనీలకు అనుగుణంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన వారు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని చక్కటి మెళకువలు చూపించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని తెలిపారు. నాంది ఫౌండేషన్ శిక్షకుడు పి.వేణుగోపాల్‌రావు, కె.సాయి ప్రణీత, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న తహసీల్దార్, ఎంఈఓ



ఉలవపాడులో ఎస్ఈపీ ఆకారంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



వెలిగండ్ల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ డీఈఓ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశాలు ఉన్నాయని తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా అన్నారు. స్థానిక ఎస్టీకాలనీ పాఠశాలలో ఎంఈఓ రాజాల కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహించడం విశేషమన్నారు. ప్రజల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల నమోదు పెంచడం, మంచి ఫలితాలు రాబట్టడం సాధ్యమవుతుందన్నారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని 64 పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు తిథి భోజనం అందించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తిభోజనం చేశారు.

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శిక్షా సప్తాహ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు వివిధ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. చివరి రోజు శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. ప్రత్యేక వంటకాలు చేయించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



గోపాలపురంలో భోజనం అందిస్తున్న హెచ్‌యం, దాత

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వెలిగండ్ల: విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర అన్నారు. శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా గుడిపాటిపల్లి కోలా అబ్రహం మెమోరియల్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర సోమవారం తనిఖీ చేశారు. దాతల సహకారంతో ప్రత్యేక భోజనాన్ని విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎంఈఓలు డి.రామిరెడ్డి, దాసుప్రసాద్, కరస్పాండెంట్ కేఎస్ఎం దాసు, భోజన దాత డి.రామిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పామూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు హెచ్‌ఎం ఎం ముసలయ్య, దాత పాలపర్తి రమణయ్య అన్నారు. మండలంలోని గోపాలపురంలో సోమవారం శిక్షా సప్తాహ్ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు దాత పాలపర్తి రమణయ్య ఆర్థిక సాయంతో పౌష్టికాహారంతో కూడిన మొత్తం 8 రకాల భోజనాన్ని విద్యార్థులకు అందించారు. ఉన్నత విద్యతోనే సమాజంలో రాణింపు, సమసమాజ స్థాపన, ఆర్థిక స్వావలంబన సాధ్యమన్నారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్, వైఎస్సార్ సీపీ నాయకులు అంచూరి సత్యంరెడ్డి పాల్గొన్నారు.

పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించాలి



పిల్లలకు ఫుడ్‌బాస్కెట్లు అందజేస్తున్న దృశ్యం

కందుకూరు: పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకుల తల్లిదండ్రులతో పాటు, వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పనిచేయాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రియంవధ అన్నారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వరల్డ్ విజన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ఫుడ్ బాస్కెట్స్ పంపిణీ చేశారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఆరు నెలలకు సరిపడా పప్పు దినుసులు, నూనె, బెల్లం, వేరుశెనగలు, గోధుమపిండి, రాగిపిండి వంటి అందించారు. పోషకాహార విలువలు కలిగిన ఆహారం తీసుకోకపోవడం వల్ల పిల్లల్లో అనేక సమస్యలు వస్తాయని చెప్పారు. ప్రధానంగా చిన్నారులు, గర్భిణుల్లో వీటి లోపం అధికంగా కనిపిస్తుందని, దీని వల్ల పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, రక్తహీనత వంటి ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. వీటిని నివారించాలంటే విటమిన్స్, ప్రోటీన్లు, కార్బొహైడ్రేడ్స్, మినరల్స్ వంటి పోషక విలువలు ఉన్న సమతుల్య ఆహారాన్ని తల్లి, బిడ్డకు అందించాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పిల్లల్లో బరువు, ఎత్తు సరిచూసుకోవాలన్నారు. వరల్డ్ విజన్ మేనేజర్ కె యోషియా మాట్లాడుతూ పిల్లలకు రుచికరమైన సమతుల్య ఆహారం అందేటట్లు చూడాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. బరువు తక్కువగా ఉన్న 53 మంది పిల్లలను గుర్తించి ఫుడ్‌బాస్కెట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్‌డీ జువేరియాభాను, మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ కె.ఆరీఫుల్లా, హెల్త్ సూపర్‌వైజర్ ఎం శ్రీనివాసరావు, వరల్డ్ విజన్ ఫైనాన్స్ విభాగం కె. శ్యామ్యూల్‌రాజ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎండ్లూరి పుల్లయ్య, శివ పాల్గొన్నారు.

ప్రకాశంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కందుకూరు: కందుకూరు, కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలు, రెడ్ క్రాస్, పోలీస్ అమరవీరుల దినోత్సవం వంటి సందర్భాల్లో తమ విద్యార్థులు రక్తదానం చేస్తుంటారని తెలిపారు. ఒక వ్యక్తి రక్తదానం వల్ల మరోవ్యక్తికి ప్రాణదాత అవుతారని, విద్యార్థి జీవితంలో ఇది మర్చిపోలేని గుర్తుగా ఉండిపోతుందని వివరించారు. భవిష్యత్‌లో నిర్వహించే శిబిరాల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి విభాగాల నుంచి కనీసం 100 మంది విద్యార్థులు రక్తదానం చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే కాలేజీలో నిర్వహించే రక్తదాన శిబిరాల్లో ఎక్కువ మంది విద్యార్థుల బ్లడ్ గ్రూపులను రికార్డు చేసి స్థానిక వైద్యశాలలో పేషెంట్లకు అవసరమైనప్పుడు రక్తదానం చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, జి. ప్రసాద్, డాక్టర్లు ఎండీ షావుద్దీన్, వెంకటరెడ్డి, విజయవాణి, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్ రామారావు, ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈఓ, చైర్మన్, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌లు ఆలయంలో స్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు, నారాయణస్వామి ఉత్సవమూర్తికి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్చుతూ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ఆలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, పోలవరపు రమేష్, చావా వేణుగోపాల్, చావా తిరిపాలు, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సరోజినిదేవి

వెలిగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ఇన్‌చార్జి సీడీపీఓ సరోజిని దేవి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు విద్యను అందించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక మాట్లాడుతూ పిల్లలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 100 రోజుల కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ కమలకుమారి, ఎంఈఓ దాసుప్రసాద్, ఐసీడీఎస్ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా భక్తులకు దర్శనం



శాకంబరీ దేవిగా జ్ఞాన ప్రసూనాంబ



కాళహస్తీశ్వరునికి ప్రత్యేక పూజలు

ఉలవపాడు: కరేడు గ్రామంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర స్వామి సోమవారం శాకంబరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో ఆషాడ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందించారు.

కరేడు విద్యార్థులకు రాష్ట్రస్థాయి పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జంప్‌రోప్ పోటీల్లో పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్‌జిల్లాల పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన తాటిపర్తి ఉపదేష్ అండర్ 12 విభాగంలో రెండోస్థానం సాధించి రజత పతకం కైవసం చేసుకున్నాడు. కొక్కిలగడ్డ వర్షిత బాలికల విభాగంలో మూడో స్థానం సాధించి కాంస్య పతకం కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన విద్యార్థులను, వ్యాయామ అధ్యాపకులు శ్రీనివాసులును పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

రెండు గ్రావెల్ టిప్పర్లు సీజ్



సింగరాయకొండ: సింగరాయకొండ-కందుకూరు మధ్య జాతీయ రహదారి పనులకు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను సోమవారం సాయంత్రం సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు మైనింగ్ శాఖ అధికారులు తిరుపతిరావు, హరిబాబు తెలిపారు. గ్రావెల్ అక్రమ రవాణాపై మైనింగ్ శాఖ డీడీ జగన్నాథరావుకు అందిన ఫిర్యాదుతో దాడి చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా మైనింగ్ అధికారుల తనిఖీ సమయంలో ఒక జేసీబీ, రెండు టిప్పర్లు మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని, అధికారులు కేవలం టిప్పర్లను మాత్రమే పోలీసులకు అప్పగించడంలో మతలబు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పొగాకులో అన్యపదార్థాలు ఉంచొద్దు

టంగుటూరు: పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన వేలంలో తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 971 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 861 కొనుగోలయ్యాయి. వ్యాపారులు 110 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ. 296.43 పలికింది.

ఆర్డీఓ కార్యాలయం వద్ద వీధి వ్యాపారుల ధర్నా



మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కనిగిరి రూరల్: ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వీధి వ్యాపారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీసీ కేశవరావు మాట్లాడుతూ పట్టణంలో ఫుట్ పాత్‌లపై బంకులు తొలగించిన కారణంగా అనేక మంది వీధి వ్యాపారులు రోడ్డున పడ్డారన్నారు. వీధి వ్యాపారులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వీధి వ్యాపారుల చట్టాన్ని ఉల్లంఘించి ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వందల కుటుంబాలు ఉపాధి కోల్పోయి దిక్కు తోచని స్థితిలో అల్లాడుతున్నారన్నారు. వీధి వ్యాపారులకు తక్షణం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్‌కు అందచేశారు. సీఐటీయూ నాయకులు బషీరా, నరేంద్ర, లక్ష్మీ ప్రసన్న, ఏడుకొండలు, వీధి వ్యాపారుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.